
aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
11-02-2026 సంపుటి : 01 సంచిక : 17 పేజీలు : 08 వెల : ₹ 5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQATI
besqati.com
Contact : info@besqati.com



## 'పిల్లల అదృశ్యం'పై సుప్రీం సీరియస్

- దీని వెనుక జాతీయ నెట్‌వర్క్ ఏదైనా పని చేస్తోందా?
- ఒకే పద్ధతిలో సాగుతున్నాయా, వేర్వేరు ఘటనలా?
- రాష్ట్రాల నుంచి గణాంకాలను తెప్పించుకోండి
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ, -10ఫిబ్రవరి (మహాప్రభ)

దేశవ్యాప్తంగా నమోదవుతున్న పిల్లల అదృశ్యం ఘటనల వెనుక జాతీయస్థాయి నెట్‌వర్క్ ఏదైనా పని చేస్తున్నదేమోననే అనుమానాన్ని సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని నిర్ధారించుకోవాల్సిందిగా కేంద్రాన్ని కోరింది. ఒకే పద్ధతిలో ఇవన్నీ జరుగుతున్నాయా లేక వేర్వేరు ఘటనలా అనేది పరిశీలించాలని సూచించింది. దీనికి సంబంధించి రాష్ట్రాల వద్ద ఉన్న గణాంకాలను తెప్పించుకుని పరిశీలించాలని కోరింది. 'గురియా స్వయమ్ సేవీ సంస్థ' అనే ఎన్జీవో సంస్థ దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణను మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం కొనసాగించింది. కేంద్రం తరఫున అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాతీ వాదనలు వినిపించారు. పిల్లల అదృశ్యం, దానిపై నమోదైన కేసుల వివరాలను కొన్ని రాష్ట్రాలు తమతో పంచుకుంటుండగా, ఎక్కువ రాష్ట్రాలు మాత్రం సహకరించడం లేదన్నారు. పూర్తి గణాంకాలు చేతిలో లేకుండా ఏ విషయమూ నిర్ధారించలేమని తెలిపారు. దీనిపై బెంచ్ జోక్యం


-మిగతా 3 లో

# నేడే పోలింగ్

## 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలో సర్వం సిద్ధం

- ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు పోలింగ్
- 2,983 స్థానాల్లో 12,652 మంది పోటీ
- 100 శాతం పోలింగ్ స్లిప్పులు పంచాం-ఎస్ఈసీ
- పోలింగ్ కేంద్రాల వద్ద ఆంక్షలు
- విద్యాసంస్థలకు సెలవు.. ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడి



హైదరాబాద్-10ఫిబ్రవరి (మహాప్రభ)

రాష్ట్ర వ్యాప్తంగా 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీల్లోని 2,983 వార్డులకు బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ పోలింగ్‌లో ఆ సమయానికి క్యూలైన్లలో ఉన్నవారందరికీ ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం కల్పిస్తారు. జరగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'కార్పొరేషన్లలో 414 వార్డులకు 2,225 మంది పోటీలో ఉన్నారు. 2 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.

-మిగతా 3 లో

## అర్జున్ టెండూల్కర్ వివాహం

- కుటుంబంతో కలసి ప్రధానిని ఆహ్వానించిన సచిన్
- రాష్ట్రపతి, రాహుల్, అమిత్ షాలకు కూడా ఆహ్వానం

న్యూఢిల్లీ, -10ఫిబ్రవరి (మహాప్రభ)

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ పెళ్లికి కుటుంబంతో కలసి ప్రధానిని కలసి ఆహ్వానం అందించారు. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబైలో వీరి పెళ్లి జరగనుంది. ఈ నేపథ్యంలో సచిన్ తన కుటుంబంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మంగళవారం కలిశారు. అర్జున్ టెండూల్కర్- సానియా చందోక్ వివాహానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను సచిన్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. -మిగతా 3 లో




## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- మూడు వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డిజీపీ శివధర్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,-10ఫిబ్రవరి (మహాప్రభ)

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. -మిగతా 3 లో





## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం తీర్మానం

- నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు
- అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు
- సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపణ

న్యూఢిల్లీ -10ఫిబ్రవరి (మహాప్రభ)

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. -మిగతా 3 లో

## నేటినుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

- అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష
- 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి




అమరావతి, -10ఫిబ్రవరి (మహాప్రభ)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. -మిగతా 3 లో



## అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

- చోద్యం చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది
- మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్,-10ఫిబ్రవరి (మహాప్రభ)

కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చోని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ -మిగతా 3 లో



## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం
- వస్త్ర పరిశ్రకు కూడా కోలుకోలేని నష్టం
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ, -10ఫిబ్రవరి (మహాప్రభ)

భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను


-మిగతా 3 లో

## తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

సొమ్ములు మావి... గొప్పలు మీవా.?

- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం కాదు
- అది తెలంగాణ ప్రజల సొమ్ము
- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...
- కేంద్ర పథకాలతో కలిపి ఇచ్చింది 51 వేల కోట్లు మాత్రమే.
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం

నిధులో కోత.. ఫెడరలిజంపై దాడే...



హైదరాబాద్, -10ఫిబ్రవరి (మహాప్రభ)

కేంద్ర ఆర్థిక విధానాల వల్ల దేశానికి అధికంగా ఆదాయం సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు, రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. వికసిత్ భారత్ అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు.

-మిగతా 3 లో

# పాకిస్థాన్‌లో 21 ఏళ్ల గరిష్ఠస్థాయికి నిరుద్యోగిత..


### ఆర్థిక స్థిరత్వం' ఉత్త డొల్ల



**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
పాకిస్థాన్ ప్రభుత్వం తాము దేశంలో ఆర్థిక స్థిరత్వం సాధించామని గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయి వాస్తవాలు పూర్తిగా అందుకు భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయికి చేరింది. లక్షలాది మంది పాకిస్థానీలకు ప్రభుత్వం చెబుతున్న 'ఆర్థిక స్థిరత్వం' అనేది ఉపాధినివ్వని ఓ పనికిరాని మాటగానే మిగిలిపోయింది. ఈ విషయాన్ని పాకిస్థానీ మీడియా కథనం ఒకటి స్పష్టంచేసింది. ది న్యూస్ ఇంటర్నేషనల్ పత్రిక కథనం ప్రకారం.. 2025 లేబర్ ఫోర్స్ సర్వే భయంకరమైన వాస్తవాలను బయటపెట్టింది. దేశంలో నిరుద్యోగిత రేటు 7.1 శాతానికి పెరిగింది. ఇది గడిచిన 21 ఏళ్లలో అత్యధికం. ఈ గణాంకాలు ప్రభుత్వ విజయవాదానికి కళ్లెం వేస్తున్నప్పటికీ, అధికారిక ప్రకటనల్లో దీని ప్రస్తావనే లేకుండా పోయింది. ఉద్యోగాలు దొరక్క ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నిత్యావసరాలు తగ్గించుకుంటున్న కుటుంబాలు, అవకాశాల్లేక ఆశలు కోల్పోతున్న యువత రూపంలో ఈ సంక్షోభం ప్రతిరోజూ కనిపిస్తూనే ఉన్నది. ఈ మీడియా కథనం నేపథ్యంలో.. 'పాకిస్థాన్ రాబోయే పదేళ్లలో ఏకంగా 3 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంటుంది' అని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా చేసిన హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఏటా దాదాపు 30 లక్షల మంది యువత ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశిస్తున్న తరుణంలో వారికి ఉపాధి కల్పించడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారింది. ఈ సంక్షోభానికి నిదర్శనంగా 2025లో రికార్డు స్థాయిలో దాదాపు 4,000 మంది డాక్టర్లు దేశం విడిచి వెళ్లిపోయారు. వృత్తిపరమైన గౌరవం, ఆర్థిక భద్రత లేకపోవడమే ఇందుకు కారణం. ఉద్యోగాల కల్పన కోసం ప్రైవేటు రంగంపై ఆధారపడటం కూడా సమస్యను జఠిలం చేస్తోంది. ఫ్యాక్టరీలు మూతపడుతుండటం, తయారీదారులు విదేశాలకు తరలిపోతుండటంతో ఆ రంగం కూడా తీవ్ర ఒత్తిడిలో ఉంది. కేవలం లెక్కల్లో స్థిరత్వం చూపిస్తూ, క్షేత్రస్థాయిలో ఉత్పత్తి సామర్థ్యం దెబ్బతింటే ఆ స్థిరత్వం వల్ల ప్రయోజనం ఏమిటని సదరు కథనం ప్రశ్నించింది.

# ఆ వంతెనను బ్లాక్ చేస్తాం..

### కెనడాకు అమెరికా హెచ్చరిక



**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
కెనడా పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్ తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్-డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది. దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనపై కెనడా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# పంజాబ్‌లో రిమోట్ కంట్రోల్ హత్యలు..


### భద్రతావర్గాలకు పెను సవాల్



**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
పంజాబ్ రాష్ట్రం లో 'రిమోట్ కంట్రోల్ హత్యలు భద్రతా వర్గాలకు పెను సవాల్‌గా మారాయి. విదేశాల్లో తలదాచుకుంటున్న నేరగాళ్లు, స్థానిక ముఠాల ద్వారా హత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేత లక్కీ ఒబెరాయ్ హత్య వెనుక కూడా విదేశీ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్ ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం మోపారు. కాగా గత కొన్నేళ్లుగా పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. విదేశాల్లో ఉంటున్న ప్రధాన నేరగాళ్లు, స్థానికంగా యువకులను నియమించుకుని రాజకీయ హత్యలు, బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఈ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంది. ఖలిస్థాన్ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు వీరిని వాడుకుంటోంది. దావూద్ ఇబ్రహీంతో గతంలో కుదుర్చుకున్న తరహాలోనే ఈ ముఠాలతోనూ ఐఎస్ఐ ఒప్పందం చేసుకుంది. డ్రగ్స్ ద్వారా వచ్చిన డబ్బులో 40 శాతం వాటాను తీసుకుని, ఆ నిధులను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ గ్యాంగ్‌స్టర్-టెర్రర్ నెట్‌వర్క్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే విస్తృతంగా దర్యాప్తు చేస్తోంది. ఈ ముఠాలను అణచివేసేందుకు పంజాబ్ పోలీసులు 'ఆపరేషన్ ప్రేయర్-2' చేపట్టారు. 'గ్యాంగ్‌స్టర్లపై వేటు' పేరుతో జరిగిన ఈ ఆపరేషన్‌లో సుమారు 10 వేల మంది పోలీసులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాంగ్‌స్టర్ల ఇళ్లు, రహస్య స్థావరాలపై ఏకకాలంలో దాడులు చేసి 1,100 మందిని అరెస్ట్ చేశారు. మొదటి దశ ఆపరేషన్‌లో ఇప్పటికే 3,256 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు ఉంటాయని స్పష్టంచేశారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య రాష్ట్రంలో ఆరు టార్గెటెడ్ హత్యలు జరగడంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్షాలు ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. కాగా, ఈ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, అమెరికా, కెనడా అధికారుల సాయంతో విదేశాల్లోని సూత్రధారులను పట్టుకునేందుకు ఎన్ఐఏ ప్రయత్నిస్తోందని భారత అధికారులు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ క్రీమీలేయర్‌పై స్పందన తెలుపండి..


### కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల క్రీమీలేయర్లకు విద్యాసంస్థల్లో అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ప్రయోజనాలను పొందకుండా మినహాయించడానికి ప్రమాణాలను నిర్దేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై తమ స్పందనను తెలియ చేయాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు కోరింది. రిజర్వేషన్లపై 2024, ఆగస్టు 1న వెలువడిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఓపీ శుక్లా, సమతా ఆందోళన సమితులు దాఖలు చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్‌లు జోయ్‌మాల బాగ్చీ, ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. దీనిపై కేంద్రం స్పందన కోరిన ధర్మాసనం కొన్ని రోజుల తర్వాత దీనిని విచారిస్తామని తెలిపింది. ప్రసిద్ధ మండల కమిషన్ తీర్పులో క్రీమీ లేయర్ సూత్రాన్ని నిర్దేశించారు. ఈ సూత్రం ప్రకారం ఓబీసీల్లోని సంపన్నులు విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగాల్లో కోటా ప్రయోజనాలను పొందకుండా నిషేధించారు. 2024లో నాటి సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అత్యంత వెనుకబడిన వారికి రిజర్వేషన్ల ప్రయోజనాలు కల్పించేందుకు ఎస్సీ కులాల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని చారిత్రక తీర్పు చెప్పింది.

# అసోంలో 2.4 లక్షల ఓట్లు తొలగింపు..

### ఎస్ఆర్ అనంతరం కొత్త ఓటర్ల జాబితా విడుదల



**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
అసోంలో 2.4 లక్షల ఓట్లను తొలగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. అసోంలో ఎన్నికల సంఘం స్పెషల్ రివిజన్ (ఎస్ఆర్) నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని 126 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్ఆర్ నిర్వహించి తాజా జాబితా విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో మొత్తం 2,49,58,139 మంది ఓటర్లున్నారు. ఇంతకుముందు ఉన్న 2,52,01,624 మంది ఓటర్లలోంచి 2,43,485 మందిని తొలగించింది. తాజా జాబితా ప్రకారం అసోంలో 1,24,82,213 మంది పురుష ఓటర్లు, 1,24,75,583 స్త్రీ ఓటర్లు, 343 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. మొదట ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితాను గత ఏడాది డిసెంబర్ 27న ప్రకటించారు. అంతకుముందు నవంబర్ 22 నుంచి డిసెంబర్ 20 వరకు ఇంటింటికీ తిరిగి ఓటర్ జాబితా సర్వే నిర్వహించారు. ఇందులో సరైన ధృవపత్రాలు లేని వారు, మరణించిన వారు, అలాగే రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవారి పేర్లను జాబితా నుంచి తొలగించారు. డిసెంబర్ 27న డ్రాఫ్ట్ ప్రకటించిన తర్వాత మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు ఓటర్లకు జనవరి 22 వరకు సమయమిచ్చారు. ఈ లోపు వచ్చిన ఫిర్యాదులు అన్నీ పరిష్కరించి తాజాగా తుది జాబితా విడుదల చేశారు. వచ్చే మార్చి-ఏప్రిల్‌లో అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఓట్ల విషయంలో ఈసీ కీలకంగా వ్యవహరిస్తోంది.

# చట్ట విరుద్ధ కంటెంట్‌ను 3 గంటల్లోగా తొలగించాలి

**ఏఐ కంటెంట్‌కు స్పష్టమైన లేబులింగ్**
**నిబంధనలు కఠినతరం**
**20 నుంచి కొత్త నిబంధనలు**




**న్యూఢిల్లీ,-10ఫిబ్రవరి (మహాప్రభ)**
యూట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కోసం ప్రభుత్వం మంగళవారం నిబంధనలను కఠినతరం చేసింది. ఇవి ఈ నెల 20 నుంచి అమల్లోకి వస్తాయి. చట్ట వ్యతిరేక కంటెంట్‌ని 3 గంటల్లోపల తొలగించడం తప్పనిసరి చేయడంతోపాటు, ఏఐ-సృష్టించిన కంటెంట్‌కి, సింథటిక్ కంటెంట్‌కు స్పష్టమైన లేబులింగ్ అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అశ్లీల, మోసపూరిత, నకిలీ కంటెంట్‌ను సృష్టించడానికి, సర్క్యులేట్ చేయడానికి పెరుగుతున్న ఏఐ దుర్వినియోగానికి ప్రతిస్పందనగా ప్రభుత్వం ఈ కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. మర్మాంగాలను బహిర్గతం చేసే కంటెంట్, పూర్తి లేదా పాక్షిక నగ్నత్వం లేదా లైంగిక చర్యల విషయంలో నిషేధించిన కంటెంట్‌ను తొలగించడానికి ప్లాట్‌ఫామ్‌లకు స్పందించే వ్యవధిని రెండు గంటలకు ప్రభుత్వం తగ్గించింది. ఈ నిబంధనలు అమలు చేయడానికి ముందు అధికారులు ఏఐ జనరేటెడ్ డీప్‌ఫేక్‌లు, సమ్మతి లేని సన్నిహిత చిత్రాలు, వ్యక్తులను అనుకరించే లేదా వాస్తవ ప్రపంచ సంఘటనలను వక్రీకరించే వీడియోలు తరచుగా ఆన్‌లైన్‌లో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు గుర్తించారు. వీటిని అరికట్టేందుకు బాధ్యతను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతోపాటు ఏఐ టూల్స్‌పై కూడా ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూల్స్, 2021ని సవరిస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది.

# కాంగ్రెస్ నేతలపై రూ.500 కోట్లకు పరువు నష్టం దావా



**గువాహటి -10ఫిబ్రవరి (మహాప్రభ)**
కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేశ్ బఘేల్, గౌరవ్ గొగొయ్‌లపై రూ.500 కోట్లకు సోమవారం పరువు నష్టం దావా వేసినట్టు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తన కుటుంబం భూ కబ్జాకు పాల్పడిందని తప్పుడు ఆరోపణలు చేసినందుకు ఈ దావా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హిమంత కుటుంబం సుమారు 12 వేల బిగాల (3960 ఎకరాలకు పైగా) భూ కబ్జాలకు పాల్పడిందని ఇటీవల గొగొయ్ ఒక మీడియా సమావేశంలో ఆరోపించారు.

# నేడే పోలింగ్

మొదటి తరువాయి

మున్సిపాల్టీల్లో 2,582 స్థానాలకు 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. ఎన్నికల కోసం 8,188 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామనీ, 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఓటర్లలో 25,49,750 మంది పురుషులు, 26,67,025 మంది మహిళలు, 638 మంది ఇతరులు ఉన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 8,191 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని ఈ ఎన్నికల నిర్వహణ కోసం నియమించారు. మంగళవారం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామాగ్రి తీసుకుని సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఫిబ్రవరి 16న వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం అదే రోజు మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికలు నిర్వహిస్తారు. ఏదైనా కారణం చేత ఎన్నిక వీలు కాకుంటే మరుసటి రోజు ఫిబ్రవరి 17న నిర్వహిస్తామని ఎన్నికల సంఘం తెలిపింది. ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ సహా ఎన్నికల సంఘం గుర్తించిన 18 రకాల ఐడీ కార్డులను ఉపయోగించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. పోలింగ్ జరిగే స్టేషన్ల పరిధిలో బీఎన్ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటర్లందరూ స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటేయ్యండి" అని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుల కోసం 92400 212456 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ఓటు ఆవశ్యకతను తెలిపే వీడియో, ఆడియో సందేశాలను ఎన్నికల సంఘం మంగళవారం విడుదల చేసింది.

'పెయిడ్ హాలిడే'

ఎన్నికలు జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల పరిధిలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజును 'పెయిడ్ హాలిడే' (వేతనంతో కూడిన సెలవు)గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యాక్టరీలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక వాడల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులందరికీ సెలవు వర్తిస్తుందని తెలిపింది. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1974), తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1988) ప్రకారం ప్రభుత్వం పెయిడ్ హాలీడేను ప్రకటించినట్టు వివరించింది. పోలింగ్ సజావుగా సాగేందుకు ఉద్యోగులకు సెలవు అమలయ్యేలా చూడాలని లేబర్ కమిషనర్, ఫ్యాక్టరీల డైరెక్టర్, అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. పోలింగ్ రోజున ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో ఉన్న స్కూళ్లకు సెలవు ప్రకటించాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఆ క్రమంలో పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజ్‌వల్ లీవ్ మంజూరు చేసింది.

## అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

మొదటి తరువాయి

అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశుగ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

## అర్జున్ టెండూల్కర్ వివాహం

మొదటి తరువాయి

అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హోంమంత్రి అమిత్ షా, విపక్ష నేత రాహుల్‌ను కూడా కలసి ఆహ్వానాలను అందచేశారు. ఈ భేటీలో అర్జున్‌తో పాటు సచిన్ భార్య అంజలి, కుమార్తె సారా కూడా పాల్గొన్నారు. ముంబైకి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబైలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్న అర్జున్ టెండూల్కర్ ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ నుంచి లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ ద్వారా మారిన సంగతి తెలిసిందే. గోవా తరఫున ఆడుతున్న అర్జున్ ఫాస్ట్ బౌలర్‌గా, లోయర్ ఆర్డర్ బ్యాటర్‌గా రాణిస్తున్నాడు. 2022లో రంజీ ట్రోఫీలో గోవా తరఫున అరంగేట్రంలోనే శతకం బాదడం విశేషం. తొలి ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన తన తండ్రి సచిన్ ఘనతను అర్జున్ తిరిగరాశాడు.

## 'పిల్లల అదృశ్యం'పై సుప్రీం సీరియస్

మొదటి తరువాయి

చేసుకుంటూ.. ఈ ఘటనల వెనుక జాతీయ నెట్‌వర్క్ లేక రాష్ట్రాల పరిధిలో ఏదైనా ప్రత్యేక గ్రూపు ఉన్నదా అనేది తెలుసుకోవాలని అనుకుంటున్నామని స్పష్టం చేసింది. అదృశ్యం చెర నుంచి బయటపడిన పిల్లలను ఆరాతీసి కొన్ని వివరాలు తెలుసుకోవచ్చునని సూచించింది. ఈ విషయంలో కేంద్రానికి సహకరించని రాష్ట్రాలను ఉపేక్షించబోమని, అవసరమైతే కఠిన ఆదేశాలు జారీ చేస్తామని బెంచ్ హెచ్చరించింది. సీనియర్ న్యాయవాది అపర్ణ భట్ స్పందిస్తూ.. దీనిపై ఇప్పటికే రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసిందని, స్పష్టమైన నిర్దేశాలను జారీచేసిందని తెలిపారు. కాగా, గత ఏడాది డిసెంబరు 9న జరిగిన విచారణ సందర్భంగా, కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా పిల్లల అదృశ్యాలకు సంబంధించిన ఆరేళ్ల గణాంకాలను తనకు అందించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

మొదటి తరువాయి

2018-19 నుంచి 2022-23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు. పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారిందని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు. డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. 'పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ' అని మంత్రి



వివరించారు. జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం÷-ర దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోందని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్ధేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు. ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బ్జడెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బ్జడెట్‌లు ఇక మానుకోని, ఫెదరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే వికసిత్ భారత్ ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

మొదటి తరువాయి

వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు.ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ



ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే స్పందించి ఏపీ నీళ్ల తరలింపును అడ్డుకోవాలని, క్యారీ ఫార్వర్డ్ విధానంలో పైనున్న శ్రీశైలంలో నీటిని ఆపి పెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

మొదటి తరువాయి

ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు.

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం తీర్మానం

మొదటి తరువాయి

సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

## నేటినుంచి ఏపీ బడ్జెట్ సమావేశాలు

మొదటి తరువాయి

ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బ్జడెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

# సంపాదకీయం

## ఎన్నికలంటే.... డబ్బున్నోళ్ల దందా !




ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థలదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటెం పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి. చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని నడిబజారులు పసుపుబియ్యంతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి

# దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ. 25 లక్షల లాపరో స్కోపిక్ పరికరాలు మంజూరు

**-ఎంపీ రఘునందన్ రావు గారి ప్రత్యేక నిధులతో అత్యాధునిక శస్త్ర చికిత్స సౌకర్యాలు**
**- ప్రభుత్వ ఆసుపత్రిలోనే లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్సలు**
**- దుబ్బాక ప్రజలకు భారీ ఊరట**

**దుబ్బాక – ఫిబ్రవరి 10 (మహాప్రభ)**
దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ. 25 లక్షల విలువైన జనరల్ సర్జరీ మరియు గైనకాలజీ లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స పరికరాలు మంజూరు కావడం దుబ్బాక నియోజకవర్గం ప్రజలకు ఎంతో శుభవార్త. ఈ అత్యాధునిక పరికరాలను మెదక్ పార్లమెంటు సభ్యులు శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారి ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేయడం జరిగింది. దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత బలోపేతం కానున్నాయి. ఈ లాపరో స్కోపిక్ పరకాల ద్వారా జనరల్ సర్జరీ మరియు గైనకాలజీ విభాగంలో మినీ మల్లి ఇన్వేసివ్ (తక్కువ కోతతో) శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి వీలు జరుగుతుంది. దీనివలన
-రోగులు త్వరగా కోలుకోవడం



- శస్త్ర చికిత్స అనంతర సమస్యలు తగ్గడం
- ఆసుపత్రిలో ఉండే రోజులు తగ్గడం
-పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం తగ్గటం జరుగుతుంది

-ఇప్పటివరకు పేద శాస్త్ర చికిత్సల కోసం ప్రైవేట్ ఆస్పత్రులు లేదా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా, ఇకపై దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు మరియు మహిళా రోగులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంకల్పంతో ఎంపీ శ్రీ రఘునందన్ రావు గారు నిరంతరం కృషి చేస్తారని. ఆయన ప్రత్యేక నిధుల ద్వారా దుబ్బాక ప్రాంతానికి లభిస్తున్న అభివృద్ధికి ఇది మరో ముఖ్యమైన ఉదాహరణ. దుబ్బాక నియోజకవర్గం ప్రజల తరపున రూ. 25 లక్షల విలువైన లాపరోస్కోపిక్ శస్త్ర చికిత్స పరికరాల మంజూరుకు మెదక్ ఎంపీ శ్రీ మాధవనేని రఘునందన్ రావు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఈ చర్యతో దుబ్బాక ప్రాంతంలో ప్రజా ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడింది ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని ఆశిస్తున్నాం.

# పోలింగ్ ప్రశాంతం గా జరగాలి. చెక్ లిస్ట్ ప్రకారం అన్ని చూసుకోండి.

**-పోలింగ్ సిబ్బంది కి ఎలాంటి ఇబ్బంది కలగకూడదు.**
**--ఏర్పాట్లు బాగుండాలి.**
**-డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాహుల్ రాజ్**

**మెదక్ జిల్లా–10ఫిబ్రవరి (మహాప్రభ)**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం మెదక్ జిల్లా కేంద్రంలోని వెస్లీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను




ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ళను సైతం పరిశీలించిన కలెక్టర్, సీ.సీ టీవీలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, సకాలంలో ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగులకు ర్యాంపులు, వీల్ చైర్లు అందుబాటులో ఉండాలన్నారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి , తహసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల బందోబస్తులో పోలీస్ సిబ్బంది పాత్ర కీలకం

**-విధులు కేటాయించిన ప్రాంతాన్ని విడిచిపెట్టవద్దు**
**-అదనపు ఎస్పీ అదనపు ఎస్పీ మహేందర్.**

**మెదక్ జిల్లా–10ఫిబ్రవరి (మహాప్రభ)**
మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి తూప్రాన్ లోని నోబెల్ ఫార్మసీ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, భయపడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పూర్తి అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన ప్రాంతాలను వదలకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో క్యూలలో ఉంచి, అనుమతిలేని వ్యక్తులను పోలింగ్ కేంద్రల పరిసరాల్లోకి అనుమతించవద్దని




ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల ఆంక్షలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఓటర్లు సెల్ ఫోన్లు లేదా ఇతర వస్తువులు తీసుకువస్తున్నారా అనే అంశంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల సామగ్రి తరలింపులో రూట్ మొబైల్ పోలీస్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ సామగ్రిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు చేర్చడంతో పాటు పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే సమయంలో పూర్తి భద్రత కల్పించాలని తెలిపారు ఎన్నికల సమయంలో ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా, గొడవలు జరిగినా, గుంపులు గుమికూడినా వెంటనే ఉన్నతాధికారులకు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ (ఎంసీసీ) నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, ఎన్నికల భద్రత సమష్టి బాధ్యత అని అదనపు ఎస్పీ మహేందర్ గారు తెలిపారు.
ఈ కార్యక్రమం లో తూప్రాన్ ఆర్డి ఓ జయచంద్ర రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తూప్రాన్ సీఐ రంగా కృష్ణ ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 'ముని ఉష' అద్భుత విజయం


- జాతీయ స్థాయికి ఎంపిక



**ఫిబ్రవరి 10 (సూళ్లూరుపేట) మహాప్రభ.**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాల మొదటి బైపిసి చదువుతున్న జడ ముని ఉష తండ్రి జడ రత్నయ్య అను బాలిక ఈనెల 6 7 తారీఖులలో చిత్తూర్ డీఎస్సీ స్టేడియంలో జరిగిన ఏపీ కుస్తీ అసోసియేషన్ అండర్ 17 బాలికల 43 కేజీల విభాగంలో స్టేట్ గోల్డ్ సంపాదించి నేషనల్ కి సెలెక్ట్ అవడం జరిగింది. ప్రత్యేకంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలను విద్యార్థులను కోచ్ ఉదయ కుమార్ ప్రత్యేక తర్ఫీదు తో పిటి మేడం బి సుధ చొరవతో ప్రిన్సిపాల్ మేడం. కే రేచల వాణి సహాయ సహకారాలతో తమవంతుగా పిల్లలను తీర్చిదిద్ది నేషనల్ కు సెలెక్ట్ అవడం తమకెంతో గర్వకారణంగా ఉందని తెలియజేశారు.

## EVM చిత్రాని రూపొందించి సందేశాన్ని ఇచ్చిన రామకోటి సంస్థ

-నిజాయితీగా ఓటు వేసి రామరాజ్యన్ని స్థాపిదాం
-భక్తిరత్న జాతీయ అవార్డు గ్రాహిత రామకోటి రామరాజు




**దుబ్బాక – ఫిబ్రవరి 10 (మహా ప్రభ**
బుధవారం జరిగే మున్సిపల్ ఎలక్షన్లో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ రామకోటి సంస్థ వినూతన ఆలోచనకు శ్రీకారం చుట్టి ఓటు వేసే ఈవీఎం చిత్రాన్ని బియ్యంతో అద్భుతంగా రూపొందించి రామకోటి కార్యాలయంలో మంగళవారం నాడు ఆవిష్కరించి సందేశాన్ని ఇచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ కి చెందిన శ్రీ రామ కోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు సామాన్యుని చేతిలో ఆయుధం అన్నారు. ఓటు వేసి ప్రతి ఒక్కరు సత్తా చాటాలన్నారు. నీతిగా నిజాయితీగా ఓటు వేయాలన్నారు. ఓటుకు అమ్ముడు పోవద్దన్నారు. అంగట్లో బర్రెలం, గొర్రెలశీ, కాము మనము మనుషులమే అని ఓటు వేసి సత్తా చాటాలన్నారు. రాజకీయ తలరాతను రాసే హక్కు మన ఓటుకు ఉందన్నారు.

## బిఆర్ఎస్ లో నుంచి కాంగ్రెస్ లో చేరిన జానకీరాం.



**మెదక్ జిల్లా–10ఫిబ్రవరి (మహాప్రభ)**
మెదక్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన 27వ వార్డ్ కు చెందిన జానకిరామ్ మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు సమక్షంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి బిఆర్ఎస్ లో నుంచి కాంగ్రెస్ లో చేరడం పట్ల ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులను కడుపులో పెట్టి కాపాడుకుంటామని, పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## నాయుడుపేట మున్సిపాలిటీ లో అభివృద్ధి పనులను పరిశీలించిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

**ఫిబ్రవరి 10 (నాయుడుపేట) మహాప్రభ.**
తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి.
తుడా చైర్మన్ మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధీకరణ తుడా నుండి 60%, మున్సిపాలిటీ నుండి 40% ప్రభుత్వ నుండి కొంత సహాయంతో చిన్న గ్రామాల నుండి పెద్ద సిటీల వరకు అభివృద్ధి జరగాలని, నాయుడుపేట మున్సిపాలిటీకి ఎంత పెద్ద వరదలు వచ్చినా సామర్థ్యం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ఉండాలని,
గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా మరిచారని కానీ మా కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే నెలవల
విజయ శ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న రెండు మున్సిపాలిటీల అభివృద్ధికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తామని



చెప్పడం సంతోషకరమని, రాష్ట్ర ప్రభుత్వం,తుడా చైర్మన్ సహకారంతో సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తామని తెలిపారు. పై కార్యక్రమంలో నాయుడుపేట టౌన్ తెదేపా అధ్యక్షులు 786 రఫీ, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్లు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామాయంపేట మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన

### ప్రత్యేక పరిశీలకులు రవికుమార్

**రామాయంపేట ఫిబ్రవరి 10 (మహాప్రభ)**
మెదక్ జిల్లా రామాయంపేట పురపాలక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాన్ని ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు కే. రవికుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా 12 వార్డులకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా



అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక సీఐ వెంకటరాజ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ప్రచారానికి అనుమతి లేదని, రాజకీయ నాయకులు, కార్యకర్తలు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేలా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు మెదక్ పోలీసుల కట్టుదిట్టమైన భద్రత.

-ఎన్నికల భద్రత కోసం ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్సులు.
-ఎన్నికల సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.
-163 బిఎన్ఎస్ఎస్ అమలు గుంపులు నిషేధం.
-మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీ ఎస్..



**మెదక్ జిల్లా–10ఫిబ్రవరి (మహాప్రభ)**
మెదక్ జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు.మంగళవారం మెదక్ టౌన్ కేంద్రంలోని వేస్లీ కాలేజీ ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు హాజరై, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 74 వార్డులు, 148 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొత్తం 686 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల భద్రతా చర్యలలో భాగంగా 17 రూట్లలో ఎస్ఐ స్థాయి అధికారులతో రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఐల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్, నలుగురు డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనించిన వెంటనే స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.
పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం నిషేధమని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిస్థాయి నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుల పంపిణీ, ఓటర్లపై ఒత్తిడి, తప్పుడు ప్రచారాలు నిర్వహించిన వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీల పరిధిలో బి ఎన్ యస్ యస్ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, దీని ప్రకారం నలుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద చర్యలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# గడ్డిఅన్నారం డివిజన్‌లో రూ. 3 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన





కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.

**గడ్డి అన్నారం – 10 ఫిబ్రవరి (మహాప్రభ)** గడ్డిఅన్నారం పరిధిలో జీహెచ్ఎంసీ నిధులతో రూ. 3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులలో భాగంగా శారదానగర్, శ్రీకోదండరామ నగర్, త్యాగరాజ నగర్, పటేల్ నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, శ్రీకృష్ణ నగర్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీ, మైత్రి నగర్ ప్రాంతాలను పరస్పరం అనుసంధానిస్తూ నిర్మించబడనున్న నూతన సీసీ రోడ్ల పనులకు ఈరోజు ఉదయం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేసి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ. డివిజన్‌లో రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన, దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా కాలనీలలో రవాణా సౌలభ్యం మెరుగుపడటమే కాకుండా వర్షాకాలంలో నీటి నిల్వలు, బురద సమస్యలు కూడా పూర్తిగా నివారించబడతాయని పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రతి కాలనీ సమాన అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు జీహెచ్ఎంసీ సహకారంతో దశలవారీగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో మరిన్ని పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నామని ఆయన వెల్లడించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించడం తమ బాధ్యతగా భావిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. స్థానిక ప్రజలు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలుపుతూ, నాణ్యమైన రహదారుల నిర్మాణం ద్వారా తమకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరూ కలిసి పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన డివిజన్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కార్పొరేటర్ శ్రీ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శారదానగర్, శ్రీకోదండరామ నగర్, త్యాగరాజ నగర్, పటేల్ నగర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, శ్రీకృష్ణ నగర్ కాలనీ, గౌతమ్ నగర్ కాలనీ, మైత్రి నగర్ కాలనీ వాసులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల కరపత్రం విడుదల







**అమ్రాబాద్,– ఫిబ్రవరి 10 (మహాప్రభ)** అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌లో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల జాతర కరపత్రాలను అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, రాయలగండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలోని కమాన్ (ముఖ ద్వారం) ఏర్పాట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రత్యేక నిధులతో చేపట్టినట్లు తెలిపారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా, మంత్రి కొండా సురేఖ ఫారెస్ట్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి కమాన్ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రారంభించాలని దేవస్థాన కమిటీకి సూచించినట్లు వివరించారు. రాయలగండి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 25 వరకు పెద్ద ఎత్తున జరగనున్నాయి. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం 22న జరుగుతుంది. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మన్నలూరు సర్పంచ్ మంజుల, చిగుర్ల కోటయ్య, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, అధ్యక్షుడు చింతల రాజగోపాల్, శంభు, వెంకటరమణ, కేశవులు, ఆనంద్, అనిల్, సర్దార్, రాంబాబు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి, – ఫిబ్రవరి 10 (మహాప్రభ)** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని, రామగుండం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, అర్బన్ లోకల్ బాడీస్‌కు రెండవ సాధారణ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనున్నాయని, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 123 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని, దాదాపు 470 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించనున్నామని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణ శ్రీ, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల నిర్వహణకు మహాదేవపూర్ మండల ఉపాధ్యాయులు



**/భూపాలపల్లి, – ఫిబ్రవరి 10 (మహాప్రభ)** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో నేడు జరగనున్న రెండవ ఆర్డినరీ మున్సిపల్ ఎన్నికల విధుల నిర్వహణకు బయలుదేరుతున్న 27వ వార్డు పోలింగ్ సిబ్బంది గా మహాదేవపూర్ మండలం ఉపాధ్యాయులు పి.ఒ. జాడీ శోభారాణి, ఏ.పి.ఒ. మద్దెల కొమురయ్య, ఓ.పి.ఒ లు కురుసం అశోక్ కుమార్, గుండోజీ నగేష్, తిప్పిరి రాజయ్య లు మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.

# దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

-ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి.

-బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా–10ఫిబ్రవరి (మహాప్రభ)** మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలో బిఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడుల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలసి పద్మ దేవేందర్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి హంగామా సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసారన్నారు. స్థానికేతరులైన మల్కాజ్గిరి నుంచి వచ్చిన గుండాలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై దాడులకు దిగి అకారణంగా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. దాడులు చేస్తూ మా పార్టీ కార్యకర్తల నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. మెదక్, రామయంపేట ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు. వీరి రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా. నరేందర్, లింసన్పల్లి మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, నాయకులు స్వామి నాయక్,

# ఎండిపోయిన కూడావెల్లినది నది సాగుకు నీరు లేని దుస్థితి

-రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన

-మల్లన్న సాగర్ నుండి కూడ వెల్లి వాగులోకి వెంటనే నీటిని విడుదల చేయాలి

- రైతులు స్వచ్ఛందంగా తరలి రావాలి



**దుబ్బాక – ఫిబ్రవరి 10 (మహాప్రభ)** ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్న నేపథ్యంలో, బొప్పాపూర్ గ్రామం తో పాటు పరిసర గ్రామాల రైతులు అందరూ కలిసి ఈరోజు ఉదయం 11:00 గంటలకు అక్బర్పేట చౌరస్తా లో శాంతియుత ధర్నా. కూడావెల్లి నది పూర్తిగా ఎండిపోయిన కారణంగా సాగునీటి కొరత తీవ్రమైంది పొలాలు ఎండిపోతుండగా, పంటలు వేసుకునే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న వేలాది రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఉన్నప్పటికీ, కూడావెల్లి నదిలో తక్షణమే నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రైతులు మరియు బొప్పాపూర్ గ్రామ సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్ స్పష్టం చేశారు.

# బల్దియా పోరుకు ఏర్పాట్లు పూర్తి..!

పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు తరలింపు



**గోదావరిఖని: – ఫిబ్రవరి 10 (మహాప్రభ)** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియకు అధికారులు పగడ్బందీగా ఏర్పాట్లు చేశారు బుధవారం రామగుండం కార్పొరేషన్ 60 డివిజన్ల కు జరిగే పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రిని తరలించారు. 1,83,049 ఓటర్లు ఉండగా పురుషులు 91,441, మహిళలు 91,578, ఇతరులు 30 మంది ఉన్నారు. ప్రధాన పార్టీలతో పాటు ఇతరులు మొత్తం315 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా ఒకటవ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారులు మడిపల్లి విజయ మల్లేష్ కు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

# బిజినెస్

## ఏ మాత్రం తరగని బంగారం వెండి, ధరలు




తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతూ పోతున్న బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 9 సోమవారం నాటి ధరలే కొనసాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి బంగారం వెండి ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఫిబ్రవరి 10 మంగళవారం 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,910 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,44,750గా ఉంది. కిలో వెండి ధర రూ.3,00,000లు పలుకుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో మంగళవారం బంగారం,వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. దేశరాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,58,060 ఉంటే, 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,44,900 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,910, అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,750లు పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060 వద్ద ట్రేడవుతుండగా... 22 క్యారెట్ల బంగారం రూ.1,45,800 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,57,910లు, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,44,750 పలుకుతోంది. వెండి కిలో రూ. 3,00,000గా ఉంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్ చేసుకుంటే మంచిది.

## అపోలో లాభంలో వృద్ధి

Indraprastha Apollo HOSPITALS
TOUCHING LIVES

**హైదరాబాద్,**
అపోలో హాస్పిటల్స్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 35 శాతం ఎగబాకి రూ.502 కోట్లకు చేరుకున్నది. మూడు బిజినెస్ వర్టికల్స్ అంచనాలకు మించి రాణించడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు. కంపెనీ ఆదాయం రూ.6,477 కోట్లకు ఎగబాకింది.

## వరుసగా మూడో రోజూ లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు.

### లాభాలకు కారణం అదే..!

దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా మూడో రోజు కూడా లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్‌లో కొన్ని కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 208 పాయింట్లు లాభపడి 84,065 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 67 పాయింట్‌ల లాభంతో 25,935 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్‌లు మెరుగ్గా రాణించాయి.నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.49 శాతం, ఎన్‌ఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.38 శాతం చొప్పున లాభపడ్డాయి. ముఖ్యంగా మైక్రోక్యాప్ కంపెనీల షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది.



డిసెంబర్ త్రైమాసికంలో బలమైన ఫలితాల నేపథ్యంలో నిఫ్టీ మైక్రోక్యాప్ 250 సూచీ ఏకంగా ఒక శాతం పెరిగింది. విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లు కొనసాగించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న ఆశలు మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ మినహా అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ట్రేడయ్యాయి. నిఫ్టీ మీడియా 2.40 శాతంతో అత్యధికంగా లాభపడగా, నిఫ్టీ ఆటో 1.37 శాతం పెరిగింది. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.23 శాతం బలపడి 90.52 వద్ద ముగిసింది. అయితే నిఫ్టీ బ్యాంక్ సూచీ మాత్రం 42.95 పాయింట్లు స్వల్పంగా నష్టపోయి 60,626.40 వద్ద స్థిరపడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి తక్షణ మద్దతు 25,550--25,600 స్థాయిల వద్ద ఉన్నది.

# స్పోర్ట్స్

## 8 రోజుల డ్రామాకు తెర...
## కొలంబోలో ఇండియా--పాక్ మహాసమరం



టీ20 వరల్డ్ కప్‌లో క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియా--పాకిస్థాన్ మ్యాచ్‌కు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది . చిరకాల ప్రత్యర్థులైన ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన హై వోల్టేజ్ పోరు గత కొన్ని రోజులుగా అనిశ్చితిలో నిలిచినా, ఇప్పుడు పరిస్థితులు సానుకూలంగా మారాయి. దాదాపు ఎనిమిది రోజులుగా కొనసాగిన పాకిస్థాన్ డ్రామాకు ముగింపు పలికే దిశగా పరిణామాలు సాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 15న శ్రీలంకలోని కొలంబో వేదికగా మ్యాచ్ నిర్వహణకు మార్గం సుగమమం అయింది. సోమవారం రాత్రి ఈ మేరకు పాక్ ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. స్నేహపూర్వక దేశాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, బహుళపక్ష చర్చల్లో సాధించిన ఫలితాల దృష్ట్యా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.అంతేకాదు క్రికెట్ స్ఫూర్తిని కాపాడటంతో పాటు, ఈ గ్లోబల్ క్రీడ కొనసాగింపునకు మద్దతు ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలియజేసింది. శ్రీలంక వేదికగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరిస్తున్నట్లు ముందుగా సంకేతాలు ఇవ్వడంతో టోర్నమెంట్‌పై సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రంగంలోకి దిగింది. ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా స్వయంగా పాకిస్థాన్‌కు వెళ్లి లాహోర్‌లో పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీతో సమావేశమయ్యారు. మ్యాచ్ ఆడకపోతే ఎదురయ్యే ఆర్థిక, ప్రతిష్టాపరమైన పరిణామాలను పాక్ బోర్డుకు వివరించినట్లు సమాచారం. అయితే బంగ్లాదేశ్‌ను టోర్నమెంట్ నుంచి తప్పించిన నేపథ్యంలో వారికి మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలనే వైఖరిని పాక్ ముందుగా ప్రదర్శించింది. ఈ పరిణామాల మధ్య ఐసీసీ--పీసీబీ సమావేశాలు కీలక మలుపు తిప్పాయి. ఈ చర్చల్లో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ చైర్మన్ అమీనుల్ ఇస్లాం కూడా పాల్గొనడం విశేషం.మరోవైపు బంగ్లాదేశ్ బోర్డు చైర్మన్ అమీనుల్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు కూడా ఈ వ్యవహారానికి కొత్త దిశను చూపించాయి. పాకిస్థాన్ నిజమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిందని ఆయన ప్రశంసలు కురిపించారు. తమకు మద్దతుగా నిలిచిన పీసీబీకి కృతజ్ఞతలు తెలుపుతూ, క్రికెట్ మేలుకోసం భారత్‌తో మ్యాచ్ ఆడాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రకటనలు పాక్ వైఖరిలో మార్పుకు కారణమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తం మీద, రాజకీయ ఉద్రిక్తతల నీడలో సాగిన ఈ వివాదానికి తెరపడింది.. క్రికెట్ ప్రేమికులకు ఇది నిజంగా థ్రిల్లింగ్ న్యూస్‌గా మారింది.

## ఫర్హాన్ మెరుపులతో..యూఎస్‌ఏపై పాక్ ఘనవిజయం




కొలంబో: మెగా టోర్నీలో తొలి మ్యాచ్‌ను అతికష్టమ్మీద గెలిచిన పాకిస్థాన్.. రెండో మ్యాచ్‌లో మాత్రం రాణించింది. గత టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో తమకు ఓటమి రుచి చూపించిన యూఎస్‌ఏపై ప్రతీకారం తీర్చుకుంటూ ఆ జట్టుపై 32 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. పాకిస్థాన్ నిర్దేశించిన 191 పరుగుల ఛేదనలో యూఎస్‌ఏ.. నిర్ణీత ఓవర్లలో 158/8కే పరిమితమైంది. శుభమ్ రంజనె (30 బంతుల్లో 51, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) శయన్ జహంగీర్ (49) పోరాడారు. యూఎస్‌ఏ బ్యాటర్లను స్పిన్నర్లు నిలువరించి ఆ జట్టుకు టోర్నీలో రెండో విజయాన్ని అందించారు. అంతకుముందు మొదలు బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' షాహిబ్‌జాదా ఫర్హాన్ (41 బంతుల్లో 73, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారానికి తోడు బాబర్ ఆజమ్ (32 బంతుల్లో 46, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో 20 ఓవర్లకు 190/9 రన్స్ చేసింది.

**ఫర్హాన్ ధనాధన్**

రెండో ఓవర్లోనే మూడు బౌండరీలతో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఫర్హాన్ దూకుడుతో పాక్ పరుగుల వేట మొదలైంది. మరో ఓపెనర్ సయీమ్ అయూబ్ (19), కెప్టెన్ సల్మాన్ అఘా (1) ఒకే ఓవర్లో నిష్క్రమించినా ఫర్హాన్ జోరు తగ్గలేదు. పవర్ ప్లేలో 56/2తో ఉన్న దశలో బాబర్ అండతో అతడు మరింత రెచ్చిపోయాడు. 27 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తైంది. హర్మీత్ 13వ ఓవర్లో బాబర్.. 6, 4, 4తో పాటు ఫర్హాన్ కూడా బౌండరీ బాదడంతో 21 పరుగులొచ్చాయి. రెండు ఓవర్ల వ్యవధిలో ఈ ఇద్దరూ పెవిలియన్ చేరినా షాదాబ్ ఖాన్ (12 బంతుల్లో 30, 4 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో పాక్ భారీ స్కోరు చేసింది.

**స్పిన్నర్ల కట్టడి**

భారీ ఛేదనలో యూఎస్‌ఏకు మంచి ఆరంభమే దక్కింది. 4.4 ఓవర్లలో 41/0తో ఉన్న ఆ జట్టు ఆ తర్వాత గాడి తప్పింది. స్పిన్నర్ల రంగప్రవేశంతో పరుగుల రాకే గగనమైంది. ఉస్మాన్ తారీఖ్ (3/27), షాదాబ్ (2/26), మహ్మద్ నవాజ్ (1/21), అబ్రర్ అహ్మద్ (1/30) నియంత్రణతో బౌలింగ్ చేయడంతో యూఏఈ ఛేదనలో వెనుకబడిపోయింది. జహంగీర్, శుభమ్ పోరాడినా వారిద్దరూ భారీ షాట్లు ఆడలేక చతికిలపడ్డారు. స్పిన్నర్ల కట్టడితో మధ్య ఓవర్లలో పరుగుల రాక మందిగించగా ఆఖర్లో ప్రత్యర్థిపై మరింత ఒత్తిడి పెంచి విజయాన్ని ఖాయం చేసుకుంది.

**సంక్షిప్త స్కోర్లు :** పాకిస్థాన్: 20 ఓవర్లకు 190/9 (ఫర్హాన్ 73, బాబర్ 46, షాట్లీ 4/25, మోహ్సిన్ 1/27);
**యూఎస్‌ఏ:** 20 ఓవర్లకు 158/8 (శుభమ్ 51, జహంగీర్ 49, ఉస్మాన్ 3/27, షాదాబ్ 2/26 )


## పది వికెట్లతో యూఏఈని ఓడించిన న్యూజిలాండ్..!




వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో భారత జట్టు చేతిలో చావుదెబ్బ తిన్న న్యూజిలాండ్ మెగా టోర్నీలో జూలు విదుల్చుతోంది. తొలిపోరులో అఫ్గనిస్థాన్ స్పిన్ ఉచ్చును ఛేదించిన కివీస్.. ఈసారి యూఏఈ భరతం పట్టింది. 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఓపెనర్లు ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) మంచుముక్కలా కరిగించారు. హైలెట్స్ చూస్తున్నామా? అన్నట్టుగా రెండో ఓవర్ నుంచి దూకుడే మంత్రగా యూఏఈ బౌలర్లపై ఈ ద్వయం విరుచుకుపడింది. అర్ధ శతకాల అనంతరం మరింత రెచ్చిపోయిన సీఫర్ట్, అలెన్ ప్రత్యర్థి బౌలర్లపై జాలి, దయ లేకుండా ఆడడంతో మరో26 బంతులు మిగిలి ఉండగానే మట్టికరిపించింది. టీ20 ప్రపంచకప్‌లో సంచలనం సృష్టించాలనుకున్న యూఏఈ కలలు కల్లలయ్యాయి. పటిష్టమైన న్యూజిలాండ్‌పై భారీ స్కోర్‌తో విజయంపై ఆశలు పెట్టుకున్న ఆ జట్టుపై ఓపెనర్లు టిమ్ సీఫర్ట్(89 నాటౌట్), ఫిన్ అలెన్(84 నాటౌట్) పిడుగల్లే విరుచుకుపడ్డారు. 174 పరుగుల ఛేదనలో నువ్వానేనా అనట్టు ఇద్దరూ పోటీపడి బౌండరీల పండుగ చేసుకున్నారు. రోహిద్ ఖాన్ వేసిన 6వ ఓవర్లో సీఫర్ట్ 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 20 రన్స్ రాబట్టగా.. పవర్ ప్లేలోనే 80కి చేరువైంది కివీస్.ఈ జోడీని విడదీసేందుకు యూఏఈ సారథి వసీం బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. స్వీప్ షాట్లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అలరించిన సీఫర్ట్, అలెన్ ఏ దశలోనూ ఔటయ్యేలా కనిపించలేదు. దాంతో.. చూస్తుండగానే లక్ష్యం చిన్నదైపోయింది. రోహిద్ వేసిన 16 వ ఓవర్ రెండో బంతిని సీఫర్ట్ సిక్సర్‌గా మలవగా బ్లాక్ క్యాప్స్ 10 వికెట్లతో జయభేరి మోగించింది. వరుసగారెండో విజయంతో మిచెల్ శాంట్నర్ బృందం గ్రూప్ డీలో అగ్రస్థానానికి ఎగబాకింది.


**వసీం, షరాఫు దంచేయగా..**

చెన్నైలో పటిష్టమైన న్యూజిలాండ్‌కు మొదట యూఏఈ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్ ముహమ్మద్ వసీం(64 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టగా.. అలీషన్ షరాఫు(55) హాఫ్ సెంచరీతోచెలరేగాడు. కివీస్ పేస్, స్పిన్ దళాన్ని ఉతికారేసిన ఈ ద్వయం విధ్వంసంతో 15 ఓవర్లకే స్కోర్ 120 దాటింది. ఆఖర్లో మయాంక్ కుమార్(21) దంచేశాడు. చివరి ఓవర్లో మరిన్ని పరుగులు రాబట్టాలనకున్న ప్రత్యర్థికి షాకిస్తూ మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీశాడు. వరుసగా రెండు వికెట్లు పడడంతో యూఏఈ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది.




# సుమంత్ 'న్యూటన్స్ థర్డ్ లా'..
# ఆసక్తికరంగా ప్రీ యాక్షన్ వీడియో

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త చిత్రం న్యూటన్స్ థర్డ్ లా. 'ఏజెంట్ ఆఫ్ కర్మ' అనేది ఈ సినిమాకు ఉపశీర్షిక. ఫిజిక్స్ సూత్రం 'చర్యకు సమానమైన ప్రతిచర్య ఉంటుంది' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌ను కర్మ సిద్ధాంతంతో ముడిపెడుతూ ఈ చిత్రాన్ని ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించారు మేకర్స్. సుమంత్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తుండగా, ఈ చిత్రంపై ఇప్పుడు భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రం మే 15న థియేటర్‌లలో విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రీ యాక్షన్ వీడియోను వదిలింది.రాజేష్ కర్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సుమంత్ సరసన నేహా పఠాన్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీనివాస్ అవసరాల, రవి వర్మ, త్రినాధ్ వర్మ, కార్తీక్ రత్నం, అభినయ, షెల్లీ ఎన్ కుమార్, గౌతమ్ పండిట్ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. మార్క్ మై వర్డ్స్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌పై హరీష్ కోహిర్కర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సింజిత్ ఎర్రమిల్లి సంగీతాన్ని అందించగా, వేదవ్యాస్ గొట్టిపాటి సినిమాటోగ్రఫీ, అనిల్ పసల ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. 1999 నేపథ్యంలో సాగే ఈ కథలో భీకరమైన యాక్షన్ సీక్వెన్స్‌లను వింగ్ చున్ అంజి పర్యవేక్షణలో రూపొందించారు.




# కుర్రాళ్ల దిల్ క్రష్ ఈ అమ్మడు..

### అయినా ఇంత అందానికి అదృష్టమే కలిసి రావట్లేదు..
### హిట్టు కోసం వెయిటింగ్..

ప్రస్తుతం కుర్రకారు క్రష్ అంటే ఠక్కున గుర్తొచ్చే హీరోయిన్ ఆమె. కొన్ని రోజులుగా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంటుంది. మరోవైపు తన అందాలతో ఎప్పటికప్పుడు లైమ్ లైట్ లో నిలుస్తోంది. ఇంతకీ ఇప్పుడు గ్లామర్ ఫోజులతో నెట్టింట హాట్ టాపిక్ అయిన ఈ హీరోయిన్ ఎవరో తెలుసుకుందామా.ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ భాగ్య శ్రీ బోర్సే. 1995 మే 6న మహారాష్ట్రలోని ఔరంగాబాద్ లో జన్మించిన ఆమె.. మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. యారియన్ 2 సినిమాతో నటిగా హిందీ సినీపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది.ఆ తర్వాత ఛాంపియన్ అనే సినిమాలో అతిథి పాత్రలో నటించింది. 2024లో రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరియమైంది. ఈ మూవీతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. మూవీ ఫ్లాప్ అయినప్పటికీ ఆమెకు మంచి ఫేమ్ వచ్చింది.ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు అందుకుంటూ తెలుగులో బిజీ హీరోయిన్ గా మారిపోయింది. కానీ ఈ బ్యూటీకి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. చివరగా రామ్ పోతినేని సరసన ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో కనిపించింది ఈ అమ్మడు.తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. సింపుల్ గ్లామర్ లుక్స్ లో కట్టిపడేస్తుంది భాగ్య శ్రీ. క్రీమ్ అండ్ లైట్ మెరూన్ కాంబినేషన్ లో ఒక లాంగ్ ఫ్రాక్ ధరించి కనిపించింది. ప్రస్తుతం ఆమె లెనిన్ చిత్రంలో నటిస్తుంది.








# రెమ్యునరేషన్ లేకుండా తమన్నా సినిమా

సినిమా కళాత్మక వ్యాపారం. ఇక్కడ తారలు తమ ఇమేజ్‌ను బట్టి పారితోషకాల్ని డిమాండ్ చేస్తుంటారు. ఇక అగ్ర తారలైతే రెమ్యునరేషన్ విషయంలో ఏమాత్రం రాజీపడరు. కానీ ఈ ధోరణికి భిన్నంగా అగ్ర కథానాయిక తమన్నా 'ఓ రోమియో' అనే హిందీ సినిమాలో అతిథి పాత్రలో నటించినందుకుగాను ఎలాంటి పారితోషికాన్ని తీసుకోలేదట. ప్రస్తుతం ఈ విషయం బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. షాహిద్‌కపూర్, త్రిప్తి డిమ్రి జంటగా నటించిన ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు విశాల్ భరద్వాజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రచార కార్యక్రమాల సందర్భంగా దర్శకుడు విశాల్ భరద్వాజ్ రెమ్యునరేషన్ల అంశం గురించి మాట్లాడారు.కథానాయిక తమన్నా, '12th ఫెయిల్' ఫేమ్ విక్రాంత్ మస్సే ఈ సినిమాలో అతిథి పాత్రల్లో నటించారని, తనతో ఉన్న స్నేహసంబంధాలతో పాటు ఓ మంచి కథకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో వారిద్దరూ పైసా పారితోషికాన్ని తీసుకోకుండానే నటించారని, ఈ రోజుల్లో అంతటి ఉదార స్వభావం ఉన్న వారు అరుదని ప్రశంసించారు. గెస్ట్‌రోల్ కోసం కొన్ని రోజులే కేటాయించినా.. ఇప్పుడున్న వ్యాపార దృక్కోణంలో ఉచితంగా నటించడం గొప్ప విషయమని బాలీవుడ్ వర్గాలంటున్నాయి. గత ఏడాది వచ్చిన 'ఓదెల-2' తర్వాత తెలుగులో తమన్నా మరే చిత్రానికి సైన్ చేయలేదు.

# హిట్ కోసం నితిన్ కొత్త స్ట్రాటజీ..

### డబుల్ రోల్‌తో సైన్స్ ఫిక్షన్, మరో డైరెక్టర్‌కు గ్రీన్ సిగ్నల్!

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ కెరీర్‌లో మరో కీలక మలుపు తిరగబోతోందని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. 'భీష్మ' తర్వాత సరైన బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూస్తున్న నితిన్, వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు మాత్రం అందుకోవడం లేదు. గత ఐదేళ్లలో చేసిన ఏడు చిత్రాల్లో ఒక్కటీ కూడా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. గతేడాది విడుదలైన 'రాబిన్ హుడ్', 'తమ్ముడు' సినిమాలపై భారీ అంచనాలు పెట్టుకున్న అభిమానులు కూడా నిరాశ చెందాల్సి వచ్చింది. దీంతో నితిన్ తదుపరి అడుగు ఎలా ఉండబోతుందనే ఆసక్తి పెరిగింది.ఈ నేపథ్యంలో నితిన్ బ్యాక్ టూ బ్యాక్ రెండు ప్రాజెక్టులకు కమిట్ కావడం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా తన కెరీర్‌లో 36వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. వర్సటైల్ డైరెక్టర్ వీఐ ఆనంద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా, పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని సమాచారం. ఇప్పటివరకు చూడని కొత్త సినిమాటిక్ అనుభూతిని అందించేలా ఈ ప్రాజెక్ట్ ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఇక ఈ సినిమాలో నితిన్ పాత్రపై ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. 'నితిన్ 36' అన్నదమ్ముల కథాంశంతో తెరకెక్కుతుందనీ, ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేయనున్నారనే టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. నితిన్ గతంలో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'అల్లరి బుల్లోడు' చిత్రంలో డబుల్ రోల్ చేశారు. ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోకపోయినా, దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మరోసారి డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది.ఇదిలా ఉంటే వీఐ ఆనంద్ సినిమా షూటింగ్ ప్రారంభం కాకముందే నితిన్ మరో దర్శకుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో 'ఆయ్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన అంజి కె. మణిపుత్ర తన తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల ఆయన నితిన్‌కు ఓ కథ వినిపించగా, హీరోకు నచ్చడంతో ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను నితిన్ తన స్వంత బ్యానర్ 'శ్రేష్ఠ మూవీస్' పై నిర్మించే ఆలోచనలో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చ నడుస్తున్న విషయం ఏంటంటే ముందుగా ఏ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుంది? వీఐ ఆనంద్ సైన్స్ ఫిక్షన్ సినిమానా, లేక అంజి మణిపుత్ర కథానా? ఏది ముందుకు వచ్చినా నితిన్‌కు ఈ రెండు సినిమాలు కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతాయనే ఆశాభావం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.

# మరో ఇంట్రెస్టింగ్ స్టోరీతో..
# ఆది సాయికుమార్ హార్రర్ థ్రిల్లర్ 'జంగిల్'




రీసెంట్‌గా శంబాల సినిమాతో గ్రాండ్ సక్సెస్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ ఆది సాయికుమార్. ఈ మూవీ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న ఆది సాయికుమార్ ఇక మరో ఇంట్రెస్టింగ్ స్టోరీతో ఆడియెన్స్‌ను కట్టిపడేసేందుకు రెడీ అవుతున్నాడు.ఆదిసాయి కుమార్ హీరోగా నటిస్తోన్న చిత్రం జంగిల్ . వేదిక హీరోయిన్‌గా నటిస్తోంది. కార్తీక్ -విఘ్నేశ్ డైరెక్షన్‌లో హార్రర్ థ్రిల్లర్ జోనర్‌లో రాబోతున్న ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతుంది. ఈ చిత్రాన్ని ఫ్రైడే పిక్చర్స్ బ్యానర్‌పై రాఘవ రెడ్డి తెలుగులో రిలీజ్ చేయనున్నారు. జంగిల్ థ్రియాట్రికల్, శాటిలైట్, డిజిటల్ రైట్స్ సహా అన్ని రైట్స్‌ను ఫ్రైడే పిక్చర్స్ సొంతం చేసుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఆదిసాయికుమార్ ఇదివరకెన్నడూ కనిపించని డిఫరెంట్ రోల్‌లో కనిపించబోతున్నాడట. హార్రర్, సస్పెన్స్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రంలో వేదిక పాత్ర హైలెట్‌గా ఉండబోతుందని.. త్వరలోనే జంగిల్ ఫస్ట్ లుక్, ట్రైలర్‌ను లాంచ్ చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com